


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 100	ఎడిటర్ : డి.శివకృష్ణ	మంగళవారం	27-10-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 100	EDITOR : D.SHIVAKRISHNA	TUESDAY	27-10-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్..

152 మీటర్లకు పెంపుపై మహారాష్ట్ర సీఎం సానుకూలత

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లుగా పెంచాలన్న తెలంగాణ విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అత్యంత సానుకూలంగా స్పందించారు. మహారాష్ట్రకు, అక్కడ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే గతంలో ఉన్న 148 మీటర్ల ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు **(మిగతా 2లో..)**



ఇ100 ఇంధనానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్..

ఇ20 వాహనదారులకు బిగ్ రిలీఫ్!

ఢిల్లీ:

పర్యావరణ పరిరక్షణ, దేశీయ ఇంధన లభ్యతను ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరొక కీలక నిర్ణయం తీసుకుంది. 100 శాతం వరకు ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో నడిచే ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలను అనుమతిస్తూ కేంద్ర మోటారు వాహనాల నిబంధనలలో మార్పును కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. ప్రముఖ వాహన తయారీ సంస్థలు తమ ఇ100 మోడళ్లను మార్కెట్లోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త నిబంధనల ద్వారా ఉద్గార ప్రమాణాల చట్రంలో ఇ85 ఇంధనంతో పాటు ఇ100కు సమాన హోదా లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ 27న విడుదల చేసిన ముసాయిదా నిబంధనలపై ప్రజలు, నిపుణుల నుంచి వచ్చిన సలహాలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ తుది నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది.

ఇ20 వాహనాలకు ఎలాంటి మార్పు అవసరం లేదు:



ప్రస్తుతం ఇ20 ఇంధనాన్ని వినియోగిస్తున్న వాహనదారులకు కేంద్రం కీలక స్పష్టత ఇచ్చింది. ఇ85, ఇ100 ఇంధనాలు ప్రత్యేకంగా వాటి కోసం రూపొందించి, ధ్రువీకరించిన వాహనాలకు మాత్రమే ఉద్దేశించినవని అధికారులు వెల్లడించారు. సాధారణ పెట్రోల్ లేదా ఇ20 ఇంధనంతో నడిచే వాహనాల్లో ఇ85, ఇ100 ఇంధనాలను వినియోగించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే రోడ్డుపై తిరుగుతున్న వాహన యజమానులు ఇ85 లేదా ఇ100 ఇంధనానికి మారాల్సిన అవసరం లేదని తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ ఇంధనాల కోసం తమ వాహనాలను మార్చుకోవాలని లేదా ప్రత్యేక మార్పులు చేయించుకోవాలని ఈ నోటిఫికేషన్ సూచించడం లేదని వివరించారు.

భగ్గుమన్న బీజేపీ

ఖర్గే వ్యాఖ్యల దుమారం.. దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల నిరసనలు



ఢిల్లీ:

ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా సోమవారం నిరసనలు చేపట్టాయి. ఖర్గే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలంటూ కమలనాథులు ఆందోళనలు నిర్వహించారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో ఓ కార్యక్రమానికి హాజరైన మల్లికార్జున ఖర్గే.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కాషాయ పార్టీ నాయకులు కాంగ్రెస్ అధ్యక్షుడిపై భగ్గుమన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయన పోస్టర్లకు నిప్పంటించి, వ్యతిరేక నినాదాలు చేశారు.

(మిగతా 2లో..)

ఇందిరమ్మ ఇండ్ల ఫైనల్ బిల్లుపై క్లారిటీ

బిల్లుల విడుదలపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులన్నింటినీ రాబోయే కొద్ది రోజుల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. సోమవారం పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఈ ప్రకటన చేశారు. ఇప్పటివరకు 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రతి ఇంటికి రూ.5 లక్షల చొప్పున రూ.40 వేల కోట్లను ప్రజా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ మరో మూడు, నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు.



ఆడబిడ్డ ఆత్మగౌరవమే లక్ష్యం:

దశాబ్దాలుగా పేదలు కంటున్న సొంతింటి కలను సాకారం చేయడానికి ఇందిరమ్మ ప్రభుత్వం ఇంకా ఎన్ని వేల కోట్లయినా ఖర్చు చేస్తుందని, ఆడబిడ్డ ఆత్మగౌరవమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యం అన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా గత ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను నెరవేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంతిల్లు కట్టించాలన్న గొప్ప సంకల్పంతో మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. అదేవిధంగా హైదరాబాద్ మహానగరంలో 1 లక్ష ఇందిరమ్మ **(మిగతా 2లో..)**

'కేటీఆర్ కన్ను పడితే మటాషే'..

ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తీవ్ర వాఖ్యలు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ పేరు మార్చుకుని హీరోయిన్లతో దుబాయ్‌కు వెళ్తున్నారని ఆరోపించారు. సోమవారం సీఎల్పీ మీడియా హాల్‌లో మాట్లాడుతూ.. 'రామ్ కేటీగా, కే రామ్‌గా పేర్లు మార్చుకుని కేటీఆర్ దుబాయ్ వెళ్లారు. ఈ ప్రయాణంలో ఇద్దరు హీరోయిన్లు సహా నలుగురు ప్రముఖులు ఆయన వెంట ఉన్నారు. హీరోయిన్లతో పాటు హైదరాబాద్ నుంచి నేరుగా దుబాయ్ వెళ్తే అందరికి తెలిసిపోతుంది కాబట్టి కేటీఆర్ బెంగళూరు, ఢిల్లీ నుంచి దుబాయ్‌కి వెళ్లారు' అని బల్మూరి వెంకట్ ఆరోపణలు చేశారు. **(మిగతా 2లో..)**

హైదరాబాద్ వాసులకు బిగ్ గుడ్‌న్యూస్..

మెట్రో ఫేజ్-2కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరవాసులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలకు కేంద్రం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76 కిలోమీటర్ల మేర ఐదు కొత్త కారిడార్లలో **(మిగతా 2లో..)**

SSC జేఈ, ఏఈఈ పరీక్షల తేదీల క్లాష్..

SSC కీలక నిర్ణయం



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్ష తేదీకి సంబంధించి కమిషన్ ఒక కీలక నిర్ణయాన్ని తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ నిర్వహించే జూనియర్ ఇంజనీర్ పరీక్షలతో ఈ తేదీలు క్లాష్ కావడంతో, **(మిగతా 2లో..)**

మహిళల ప్రయాణాల్లో తెలంగాణ టాప్!..

ఉచిత బస్సు ప్రయాణాల్లో ఆ రాష్ట్రాలను వెనక్కి నెట్టిన తెలంగాణ

సీఎం రేవంత్ సంచలన ట్వీట్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

మహాలక్ష్మి పథకం అనేది కేవలం ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాదని, అది తెలంగాణ మహిళల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వయం ప్రతివత్తికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్ఎన్ఓ నిర్వహించిన ఆల్ ఇండియా టైమ్ యూజ్ సర్వేలో తెలంగాణ మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడికావడం గర్వకారణమన్నారు. మహిళలు ఈ పథకానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని, మహాలక్ష్మి అమలు దేశానికే ఆదర్శంగా మారిందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. మహిళల సాధికారత కోసం తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ గణాంకాలు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు.

రోజుకు 37 లక్షల మంది మహిళల ప్రయాణం:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ పథకం మహిళలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు గౌరవప్రదమైన జీవనానికి కొత్త మార్గాలను తెరిచిందన్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ 37 లక్షల మంది వరకు మహిళలు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ ప్రాంతాలకు చేరుకుంటున్నారని వెల్లడించారు. మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశాన్ని మహాలక్ష్మి కల్పిస్తోందని పేర్కొన్నారు.

పొన్నం ప్రభాకర్‌కు సీఎం ప్రశంసలు

మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతుండటంపై **(మిగతా 2లో..)**

భగ్గుమన్న బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

బిహార్‌లో కమలనాథులు ఆందోళనలు నిర్వహించి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ వివాదంపై బీజేపీ అగ్ర నాయకులూ స్పందించారు. ఖర్గేను కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా విమర్శించారు. 'ఇది చాలా బాధాకరం. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే.. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో చిన్న స్థాయి వ్యక్తి చేయలేదు. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ వాసులకు బిగ్ గుడ్‌న్యూస్..

(మొదటిపేజీ తరువాయి)

ఈ నిర్మాణ పనులను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మెట్రో ఫేజ్-2 పనులను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే నాగోల్-ఎయిర్‌పోర్ట్(ఎయిర్‌పోర్ట్ కారిడార్) మార్గంతో ముందుగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఫేజ్-2లోని ఐదు ప్రధాన కారిడార్లు..

కారిడార్ 1 (నాగోల్ - ఎయిర్‌పోర్ట్): 36.8 కిలోమీటర్లు.

కారిడార్ 2 (రాయదుర్గం - కోకాపేట): 11.6 కిలోమీటర్లు.

కారిడార్ 3 (ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట): 7.5 కిలోమీటర్లు (పాతబస్తీ లైన్).

కారిడార్ 4 (మియాపూర్ - పటాన్‌చెరు): 13.4 కిలోమీటర్లు.

కారిడార్ 5 (ఎల్బీనగర్ - హయత్ నగర్): 7.1 కిలోమీటర్లు.

ఈ ఐదు కారిడార్లు అందుబాటులోకి వస్తే నగరంలోని ప్రధాన సమాచార వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఐటీ కారిడార్, పాతబస్తీ, ఔటర్ వైపు వెళ్లే ప్రయాణీకులకు ట్రాఫిక్ తిప్పలు తప్పి, వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

SSC జేఈ, ఏఈఈ పరీక్షల తేదీల క్లాష్..

(మొదటిపేజీ తరువాయి)

నిరుద్యోగ అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని TGPSC ఈ మార్పునకు శ్రీకారం చుట్టింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఏజు నిర్వహించే జీజు పరీక్షలు మరియు TGPSC AEE పరీక్షలు నవంబర్ 6వ తేదీన ఒకే రోజు నిర్వహించేలా గతంలో షెడ్యూల్ ఖరారైంది. దీంతో రెండు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వేలాది మంది ఇంజనీరింగ్ అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో రెండు పరీక్షలు రాయాలనుకునే అభ్యర్థులు తమకు ఎదురవుతున్న ఇబ్బందిని వివరిస్తూ కమిషన్‌ను ఆశ్రయించి, పరీక్ష తేదీని మార్చాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన TGPSC, నవంబర్ 6న జరగాల్సిన ఏఈఈ పరీక్షను నవంబర్ 7వ తేదీకి రీషెడ్యూల్ చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించింది. అయితే, రెండు పరీక్షల తేదీలు క్లాష్ అవుతున్న అభ్యర్థులు మాత్రమే ఈ సదుపాయం కోసం తగిన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. SSC JE పరీక్షతో పాటు TGPSC AEE పరీక్ష రెండింటికీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, సంబంధిత హాల్ టికెట్లు లేదా దరఖాస్తు పత్రాలను కమిషన్‌కు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోపు అధికారిక ఈ-మెయిల్ ద్వారా పంపించాలని TGPSC స్పష్టం చేసింది. నిర్దిష్ట గడువులోగా వచ్చిన విజ్ఞప్తులను మాత్రమే పరిశీలించి, పరీక్ష నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.

'కేటీఆర్ కన్ను పడితే మటాషే'..

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం కేటీఆర్‌పై బల్మూరి వెంకట్ తీవ్ర విమర్శలు చేశారు. 'వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడడం ఎందుకని ఓపిక పడుతున్నాను. ఇంట్లో బెంగళూరు, ఢిల్లీకి వెళ్తున్నాని అబద్ధాలు చెప్పి.. కేటీఆర్ దుబాయ్ వెళ్లారు. నేను చెప్పేది అబద్ధమని ఆయన తన కొడుకుపై ఒట్టేసి చెప్పగలరా..?' అని ప్రశ్నించారు. 'కేటీఆర్ ఒక రాక్షసుడు. ఆయనకు మహిళల ఉసురు తగులుతుంది. కేటీఆర్ కన్ను పడితే అంతా మటాషే. ఆయన కారణంగా తెలంగాణలో సినిమా తీయాలంటే నిర్మాతలు, డైరెక్టర్లు భయపడుతున్నారు. వారు వేరే రాష్ట్రాలకు వెళ్లి షూటింగ్ చేసుకుంటున్నారు' అని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మండిపడ్డారు.

కేసీఆర్‌పైనా ధ్వజం..

ఆ తరువాత బల్మూరి వెంకట్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పలు విమర్శలు చేశారు. తెలంగాణ నీటి కొరతకు కారణం కేసీఆర్ అని ఆరోపించారు. గతంలో కేసీఆర్ వైసీపీ అధ్యక్షుడు జగన్‌తో మంతనాలు ఎందుకు నడిపారని ప్రశ్నించారు. ఆ పార్టీ ఎమ్మెల్యే రోజా దగ్గర రొయ్యల పులుసు ఎందుకు తిన్నారని నిలదీశారు.

ఇందిరమ్మ ఇండ్ల ఫైనల్ బిల్లుపై క్లారిటీ

(మొదటిపేజీ తరువాయి)

ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు.

648 ఇండ్లలో 620 పూర్తి:

సోమవారం నాటి పర్యటనలో భాగంగా నేలకొండపల్లిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన 145 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి మంజూరు పత్రాలను అందజేశారు. ఇప్పటికే మండలంలో మొదటి విడతలో మంజూరైన 648 ఇళ్లలో 620 పూర్తి కాగా వివిధ కారణాల వల్ల మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్..

(మొదటిపేజీ తరువాయి)

తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై చర్చించేందుకు సోమవారం ముంబైలోని 'సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్'లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం భేటీ అయ్యింది. తుమ్మిడిహెట్టి నిర్మాణంపై సానుకూల చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలించిన ఫడ్నవీస్ బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై అధ్యయనం.. తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్ ప్రస్తావించారు.

అధ్యయనానికి అధికారుల కమిటీ:

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపు ప్రతిపాదనపై అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సూచించారు. మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదన్నది తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు అభ్యంతరం లేదని, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీని ఏర్పాటు చేసి బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ప్రతిపాదించారు. ఇరు రాష్ట్రాల అంచనాలను పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తన పరిధిలో అవసరమైన సాంకేతిక పరిశీలనలు, అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు.

కార్యాచరణ ప్రణాళిక:

రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు పరస్పరం సంప్రదింపులు జరిపి తదుపరి సమావేశాలు, కాలపరిమితులు నిర్ణయించుకోవాలని ఫడ్నవీస్ సూచించారు. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తన అమ్మమ్మ తెలుగు మాట్లాడేవారని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో పొరుగు రాష్ట్రాలుగా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర వలస అంతర్రాష్ట్ర సమస్యలను చర్చలు, సహకారం ద్వారా పరిష్కరించుకుందని పేర్కొన్నారు.

గిరిజనుల దశాబ్దాల కల నెరవేరాలి:

ఈ చర్చల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పూర్వ హైదరాబాద్ సంస్థానం నుంచి తెలంగాణ-మహారాష్ట్రల మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. కొమురం భీమ్ సాగించిన 'జల్, జంగిల్, జమీన్' పోరాటం కాలం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేయవచ్చని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం కలిగిన ప్రాంతమైనప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే తెలంగాణతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని కేవలం సాగునీటి ప్రాజెక్టుగా కాకుండా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే వారధిగా చూడాలని అభిప్రాయపడ్డారు.

గ్రావిటీ ద్వారా నీటి తరలింపుకే 152 మీటర్ల ఎత్తు:

అంతకుముందు ఈ సమావేశంలో తుమ్మిడి హెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్ల ప్రతిపాదన వెనుక ఉన్న కారణాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పీపీటీ ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, పర్యావరణ పరిరక్షణ మరియు నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడానికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడమే సరైన మార్గమని, అందుకే బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడం అవసరమని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు ఆ రాష్ట్రంలో ఉన్న భూసేకరణ నిబంధనలు మరియు పరిహార విధానం ప్రకారమే తెలంగాణ ప్రభుత్వం పూర్తి పరిహారం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు.

'ఇన్వెస్ట్ తెలంగాణ' సదస్సుకు ఫడ్నవీస్‌కు ఆహ్వానం

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సుకు హాజరయ్యేందుకు ఆసక్తిగా ఉన్నానని, పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

మహిళల ప్రయాణాల్లో తెలంగాణ టాప్!..

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళల పట్ల గర్వంగా ఉందన్నారు. ప్రతిరోజూ లక్షలాది మంది మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రవాణా శాఖను సమర్థవంతంగా నడిపిస్తూ మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందించారు. మహిళల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ టాప్:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో రాష్ట్రంలో మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే మహిళల రాకపోకల్లో అత్యధిక వృద్ధి నమోదైంది. జాతీయ గణాంక కార్యాలయం నిర్వహించిన ఆల్ ఇండియా టైమ్ యూజ్ సర్వే గణాంకాల డేటాను ఓ ఆంగ్ల దినపత్రిక ప్రచురించింది. 2019లో తెలంగాణలో 15 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళల్లో రోజుకు కనీసం ఒక్కసారైనా బయటకు ప్రయాణించిన వారి శాతం 43.7గా ఉండగా, 2024 నాటికి అది 54.6 శాతానికి పెరిగింది. అంటే ఐదేళ్ల వ్యవధిలో 10.9 శాతం పాయింట్ల పెరుగుదల నమోదైందని ఈ సర్వే పేర్కొంది. అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మహిళల ప్రయాణాల తీరును ఈ కథనంలో వివరించింది. ముఖ్యంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాల్లో మహిళల రాకపోకలు పెరిగినట్లు వెల్లడించింది. తెలంగాణలో మహిళల ప్రయాణాలు 10.9 శాతం పాయింట్లు పెరగగా, తమిళనాడులో 6.7, కర్ణాటకలో 5, పంజాబ్‌లో 4.1 శాతం పాయింట్ల వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో తెలంగాణలో పురుషుల ప్రయాణాలు 7.1 శాతం పాయింట్లు పెరిగాయి. అంటే పురుషులతో పోలిస్తే మహిళల ప్రయాణాల్లో 3.8 శాతం పాయింట్ల అదనపు వృద్ధి కనిపించింది. ఉచిత బస్సు ప్రయాణ పథకాలు అమలవుతున్న నాలుగు రాష్ట్రాల్లో మహిళల ప్రయాణాలు సగటున 6.6 శాతం పాయింట్లు పెరగగా, ఇతర రాష్ట్రాల్లో 4.4 శాతం పాయింట్ల వృద్ధి మాత్రమే నమోదైనట్లు ఈ కథనం పేర్కొంది.

కులకర్ణి రాజప్రభాకర్ రావు పరామర్శ

స్టార్ త్రినేత్రం, నారాయణపేట:



నారాయణపేట జిల్లా కోస్గి మండలానికి చెందిన తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యకర్త క్రాంతి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ కులకర్ణి రాజప్రభాకర్ రావు సోమవారం ఉదయం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా క్రాంతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలకు కష్టసమయాల్లో అండగా ఉండాలనే ఉద్దేశంతో రాజప్రభాకర్ రావు స్వయంగా క్రాంతి ఇంటికి వెళ్లి పరామర్శించడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కోస్గి మండల నాయకులు తనిష్క్ దేవ్ సింగ్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల కాలుష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

స్టార్ త్రినేత్రం, నల్గొండ:

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోని పలు ఫార్మా కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై గ్రామానికి చెందిన పోలగోని శివప్రసాద్ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫార్మా కంపెనీల కార్యకలాపాల వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, దీనివల్ల వ్యవసాయ పంటలపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు పశువుల మేతకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలుషిత నీటి కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అదేవిధంగా కొన్ని కంపెనీల వ్యర్థాలను రోడ్ల పక్కన పడవేయడం వల్ల పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, కాలుష్య కారకాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని శివప్రసాద్ కోరారు. ముఖ్యంగా వెలిమినేడు గ్రామ పరిధిలోని భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించి, కాలుష్యానికి గల కారణాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను పారవేస్తున్న కంపెనీలపై తగిన చర్యలు తీసుకోవాలని, కాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు



చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ భూములు, భూగర్భ జలాల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పోలగోని శివప్రసాద్ తన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాను: కులకర్ణి రాజ ప్రభాకర్ రావు

స్టార్ త్రినేత్రం, కొడంగల్:



మరికంటి రవి కుమార్ తండ్రి మరికంటి చంద్రశేఖర్ మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రక్షణ సేన పార్టీ కొడంగల్ నియోజకవర్గం ఇంఛార్జ్ రాజ ప్రభాకర్ సోమవారం మద్దూర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖాన్ని పంచుకున్న ఆయన.. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కుటుంబానికి అవసరమైన సమయంలో తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మరికంటి చంద్రశేఖర్ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, బాధను తట్టుకుని ముందుకు సాగాలని ధైర్యం చెప్పారు.

రైతులకు అండగా రాజప్రభాకర్ రావు

నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్
రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించాలి
విద్యుత్, సాగునీరు అందించడంలో ప్రభుత్వ విఫలం
టీఆర్ఎస్ కొడంగల్ నియోజకవర్గ ఇంఛార్జ్ రాజ ప్రభాకర్ రావు



స్టార్ త్రినేత్రం, నారాయణపేట:

నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కొడంగల్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ రాజ ప్రభాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడిందని, రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.ఎల్నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటల సాగుకు అవసరమైన నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు ముందస్తుగా విద్యుత్, సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.నారాయణపేట-కొడంగల్ సాగునీటి ప్రాజెక్టు ప్రక్రియలో భాగంగా ఎకరాకు రూ.40 లక్షల విలువైన భూమికి రూ.25.20 లక్షలు మాత్రమే చెల్లించి రైతుల భూములను తీసుకోవడం వల్ల వారికి ఆర్థిక నష్టం జరుగుతోందని రాజ ప్రభాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, కరువు పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయ రంగాన్ని ఆదుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

స్టార్ త్రినేత్రం,వేములవాడ :



సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు – రోహిణి వారి పుత్రిక జన్మదిన వేడుకలు కరీంనగర్ లోని విజయ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించారు ఈ పుట్టినరోజు వేడుకలలో సాయి రూపా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు ఏద్దండి రాజు – సరళ, ట్రస్ట్ సభ్యులు బోడిగే రాజు, వేముల సతీష్,గొంటి నవీన్, వాసాల హరిప్రసాద్, చేకూర్తి నవీన్ పటేల్,అకులేష్ రెడ్డి, మహేందర్, శివరాత్రి వెంకటేష్,అడిగొప్పుల విద్య శ్రీ, పాల్గొని పుట్టినరోజు జరుపుకుంటున్న హాష్మిక కి బహుమతి అందజేసి వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది హాష్మిక నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ట్రస్ట్ సభ్యులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

24 గంటల్లో హత్య కేసు ఛేదన.. నిందితుడిని పట్టుకున్న పోలీసులు

స్టార్ త్రినేత్రం, వరంగల్:



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మాల్యాతండా గ్రామ పరిధిలోని హర్జాతండాలో చోటుచేసుకున్న మహిళ హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. భార్యతో గొడవ నేపథ్యంలో ఆమెను హత్య చేసి, ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భర్త పాల్తియ బాలు (63)ను పోలీసులు చింతనెక్కొండ వద్ద పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ద్వారా రిమాండ్‌కు తరలించారు.ఈ కేసుకు సంబంధించిన పోలీసుల వివరాల ప్రకారం.. హర్జాతండాకు చెందిన పాల్తియ బాలు, ఆయన భార్య పాల్తియ పూలమ్మ (53) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, ముగ్గురికీ వివాహాలు జరిగాయి. వారు ఉద్యోగాల నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. గత 10 సంవత్సరాలుగా బాలు మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.దసరా పండుగకు ముందు ఉప్పలమ్మ పండుగ చేసుకునేందుకు ఇంటికి రావాలని కుమారుడు నవీన్‌కు బాలు ఫోన్ చేయడంతో, నవీన్ తన తల్లి పూలమ్మను తీసుకొని హర్జాతండాకు వచ్చాడు. ఈ క్రమంలో 24-10-2026న భర్త వివాహేతర సంబంధం విషయమై పూలమ్మ నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో రాత్రి సుమారు 7 గంటల సమయంలో బాలు భార్య గొంతు నులిమి, టవల్‌తో మెడకు ఉరివేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆమె స్పృహ కోల్పోవడంతో చనిపోయిందని భావించి, ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని బాలు పథకం వేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.తండా శివారులో ఇల్లు ఉండటం, సమీపంలోని గడ్డపార తండాలో ఒకరు మృతి చెందడంతో అక్కడికి గ్రామస్థులు వెళ్లిన పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇంటి నుంచి బయటకు వచ్చి పరిసరాల్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం, తన అంగీపై ఉన్న రక్తపు మరకలు బయటపడకుండా ఉండేందుకు అంగీతో పాటు హత్యకు ఉపయోగించిన టవల్‌ను ఒక కవరులో పెట్టుకున్నాడు. అనంతరం తన భార్యను టీఎస్-24-బీ-3600 నంబరు గల స్ప్లెండర్ ప్లస్ మోటార్‌సైకిల్‌పై ముందు కూర్చోబెట్టి, ఆమె తనపై ఒరిగేలా చేసుకొని సుమారు 1 కిలోమీటరు ప్రయాణించాడు.లాల్ తండా సమీపంలోని బోడ దేవలా వ్యవసాయ భూమి వద్దకు చేరుకున్న బాలు, రోడ్డుపై మోటార్‌సైకిల్‌ను కిందపడేశాడు. ఆ సమయంలో భార్య కొద్దిగా కదిలినట్లు అనిపించడంతో ఆమె ఇంకా బతికే ఉందని అనుమానించి, మరోసారి గొంతు నులిమి, తలను రోడ్డుకు కొట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఘటనపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు తన కుడి కన్ను కింద రాయితో గాయపరుచుకొని, ఆ రాయిని సమీపంలోని చెట్లలోకి విసిరేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితుడిని చింతనెక్కొండ వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

ప్రజావాణిలో 153 అర్జీలు స్వీకరణ

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



స్టార్ త్రినేత్రం, వరంగల్:

వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో సమర్పించే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 153 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు 55, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 24, డీఆర్‌డీఏకు 8, గృహ నిర్మాణ శాఖకు 11, ఇతర శాఖలకు సంబంధించి 55 అర్జీలు అందాయి. ప్రతి దరఖాస్తును పరిశీలించి, అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రజావాణిలో వృద్ధులు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పించడంతో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేకంగా స్పందించారు. వృద్ధులకు సంబంధించిన అర్జీలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన ఓ వృద్ధుడి పరిస్థితిని గమనించిన కలెక్టర్ మానవీయంగా స్పందించి, ఆయనకు టీషర్ట్, జనపనార సంచిని అందజేశారు. తన సమస్యను పరిష్కరించేందుకు కూడా సంబంధిత అధికారికి అర్జీని పంపించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ చూపిన ఆప్యాయతకు వృద్ధుడు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం చూపడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వసంత, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఓటు బచావో-దేశ్ బచావో ప్రచారాన్ని విస్తృతం చేయాలి

గ్రామాలు, వార్డుల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి: కాంగ్రెస్ నాయకులు

స్టార్ త్రినేత్రం, హన్మకొండ:







హన్మకొండలోని డీసీసీ భవన్‌లో సోమవారం ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ఓటు బచావో-దేశ్ బచావో ఫేజ్-3 ప్రచార మార్గదర్శకాల అమలుపై సమావేశం నిర్వహించారు. హన్మకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఓటు హక్కు పరిరక్షణ, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకులు కే.బి.ఆర్. నాయుడు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కుడా చైర్మన్ గుండు సుధారాణి, మేరా కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకటరాజ్యం, టీపీసీసీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దొమ్మటి సాంబయ్య, టీపీసీసీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవళి రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కే.బి.ఆర్.నాయుడు మాట్లాడుతూ, ఓటు హక్కు పరిరక్షణలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పార్టీ శ్రేణులు జాగ్రత్తగా పరిశీలించాలని, కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు వాస్తవాల ఆధారంగా సమాధానం ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు గుర్తింపు, అవకాశాలు కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఢిల్లీలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ, ఓటు హక్కును కాపాడటం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం లక్ష్యంగా చేపట్టిన ఓటు బచావో--దేశ్ బచావో కార్యక్రమాన్ని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఏఐసీసీ, టీపీసీసీ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఫేజ్-3 ప్రచారాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు, అర్హులైన ప్రతి ఓటరు ఓటర్ల జాబితాలో ఉన్నారో లేదో పరిశీలించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సిద్దిపేటలో 100కు పైగా సైకిళ్లతో భారీ ర్యాలీ.. స్వయంగా పాల్గొన్న సీపీ రష్మి పెరుమాళ్





స్టార్ త్రినేత్రం, సిద్దిపేట:
దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడంతో పాటు స్వయంగా సైకిల్ తొక్కుతూ ర్యాలీని పూర్తి చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం, పోలీసుల సేవలను గుర్తుచేయడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పోలీసులు రాత్రింబవళ్లు ప్రజల రక్షణ కోసం కఠినమైన విధులు నిర్వహిస్తున్నారని, వారి సేవలను సమాజం గుర్తించాలని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. 100కు పైగా సైకిళ్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభమైన ర్యాలీ ముస్తాబాద్ చౌరస్తా, విక్టర్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ చౌరస్తా వరకు కొనసాగింది. పోలీసు సిబ్బంది బైకులపై ర్యాలీని అనుసరిస్తూ అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను నిరంతరం స్మరించుకుంటూ, వారి సేవలను ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట పట్టణ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హయత్ నగర్‌లో ఘనంగా 'సృష్టి ఐ కేర్ అండ్ ఆప్టికల్' ప్రారంభం

ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి

కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి: కల్లెం నవజీవన్ రెడ్డి

స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:



హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బొమ్మల గుడి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సృష్టి ఐ కేర్ ఆప్టికల్' కేంద్రాన్ని తాజా మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కల్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వాడకం అధికమవ్వడం వల్ల చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు దృష్టి లోపాలు, కంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కంటి చూపు అమూల్యమైనదని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. స్థానిక ప్రాంత ప్రజలకు అందుబాటులో నాణ్యమైన కంటి వైద్య సేవలు, ఆధునిక ఆప్టికల్ సౌకర్యాలు అందించేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులను ఆయన అభినందిస్తూ, సంస్థ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సంస్థ నిర్వాహకురాలు, కన్సల్టెంట్ ఆప్టోమెట్రిస్ట్ డి. సాధిత మాట్లాడుతూ, తమ కేంద్రంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కంటి పరీక్షలు, నాణ్యమైన ఫ్రేమ్‌లు, బ్లూ లైట్ ఫిల్టర్ లెన్స్‌లు, ప్రోగ్రెసివ్ మరియు బైఫోకల్ లెన్స్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో, విశ్వసనీయమైన సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, కాలనీవాసులు, నిర్వాహకుల కుటుంబ సభ్యులు మరియు మిత్రులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి: అరూరి రమేష్

ఓటరు నమోదుపై అరూరి రమేష్ సమీక్ష

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు

ఏజీఆర్ గార్డెన్స్‌లో సమీక్ష సమావేశం.. హాజరైన అరూరి రమేష్



స్టార్ త్రినేత్రం, వరంగల్:
వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్ సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లు ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఏజీఆర్ గార్డెన్స్‌లో సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 43వ, 44వ, 45వ, 46వ, 64వ డివిజన్లకు చెందిన 100 ఓట్ల బాధ్యులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కుకు అర్హులైన పట్టభద్రులను గుర్తించి, కొత్త ఓటరు నమోదులు పెద్ద సంఖ్యలో జరిగేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి అర్హులైన పట్టభద్రుడికి ఓటరు నమోదు ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మసూద్, మాజీ కార్పొరేటర్ ఆవల రాధికా రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనం రెడ్డి, దొపతి జయపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దయాకర్‌కు ఘన సన్మానం

స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:




తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎంపికైన వెలమకంటి దయాకర్ సోమవారం తొలిసారిగా వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రానికి రావడంతో సంఘం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి దయాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ఎదుట ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములును కొత్తపెల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఈసంపల్లి రమేష్, రాష్ట్ర సలహాదారులు నిలయ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల వివేకానంద, జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీకాంత్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మరుపట్ల అంజయ్య, ఎంఆర్‌పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాస్, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ కార్యదర్శి మామిళ్ల చెన్నయ్య, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జంగిల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ వైద్యురాలు డాక్టర్ రూత్ జాన్ పాల్‌కు ఘన సన్మానం

అభినందించిన భారతి చారిటబుల్ ట్రస్ట్

ఎన్నో ఇబ్బందులను అధిగమించి వైద్యురాలిగా ఎదిగిన రూత్

అట్టడుగు వర్గాలకు వైద్య సేవలు అందించాలి: డాక్టర్ రాజేంద్రప్రసాద్




స్టార్ త్రినేత్రం, వరంగల్:
వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచెర్ల గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ వైద్యురాలు డాక్టర్ రూత్ జాన్ పాల్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. వైద్య విద్యలో ఎండీ పూర్తి చేసి దేశంలోనే తొలి ట్రాన్స్‌జెండర్ వైద్యురాలిగా గుర్తింపు పొందినట్లు పేర్కొంటూ, ఆమె గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, వైద్య వృత్తి ద్వారా తన సమాజంతో పాటు దేశ ప్రజలకు సేవలందించేందుకు ముందుకొచ్చిన డాక్టర్ రూత్ జాన్ పాల్‌ను అభినందించారు. ట్రాన్స్‌జెండర్లతో పాటు సమాజంలోని అట్టడుగు, బలహీన వర్గాలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. తన ప్రయాణంలో ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ నుంచి వచ్చి తనను ఘనంగా సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ కీర్తి సతీష్ కుమార్ మాట్లాడుతూ, వైద్య రంగంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తిగా ఆమె సాధించిన గుర్తింపు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆమె ప్రతిభను గుర్తించి తగిన ఉద్యోగావకాశం కల్పించడంతో పాటు, ప్రజలకు సేవలందించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రూత్ జాన్ పాల్ తల్లి నమ్మక్క, అన్నయ్య శ్రీనివాస్, వదిన నుహాసిని తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగుల గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, సరెండర్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కు TSCPSEU నాయకుల వినతి

స్టార్ట్ త్రినేత్రం, వరంగల్:



సిపిఎస్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందవలసిన గ్రాట్యుటీ, మరణించిన సిపిఎస్ ఉద్యోగుల కుటుంబాలకు అందవలసిన ఫ్యామిలీ పెన్షన్, PRAN సరెండర్ తదితర అంశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ TSCPSEU (తెలంగాణ రాష్ట్ర సి పి ఎస్ ఉద్యోగుల సంఘం) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఎస్ ఉద్యోగులు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు విద్య సాగర్ మాట్లాడుతూ.. గ్రాట్యుటీ మంజూరు, ఫ్యామిలీ పెన్షన్ ప్రాసెసింగ్, PRAN సరెండర్ వంటి అంశాల్లో సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగడం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు,కావున జిల్లా కలెక్టర్ ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత ఋూలు, ట్రెజరీ అధికారులు మరియు ఇతర శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన ఉద్యోగులకు గ్రాట్యుటీ, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీ]ొఱ్ఱPRAN సరెండర్‌కు సంబంధించిన ప్రక్రియలను ఎలాంటి అనవసర జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో TSCPSEU వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ రవి, ఉపాధ్యక్షులుపల్లె ఉదయ్ హనుమకొండ అధ్యక్షులుకొండ శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్ వైస్ ప్రెసిడెంట్ కర్ణ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com